క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: కాజీపేట శివారు టేకులగూడెం ప్రాంతంలో మార్చి 1న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. టేకులగూడెం ప్రాంతంలోని వ్యవసాయ సర్వీస్‌లకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రేపు ఉర్సు హవేలీలో రంజాన్ మాసం సదస్సు



కరీమాబాద్: వరంగల్ ఉర్సు హవేలీలో ఈనెల 2వ తేదీన రంజాన్ మాసం సదస్సు(జల్సా)ను నిర్వహించనున్నట్లు ఉర్సు హవేలీ పీఠాధిపతి సయ్యద్ యా ఏహిమా పాషాఖాద్రీ షోయబ్ బాబా తెలిపారు. ఈమేరకు సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఉర్సు హవేలీలో గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 48 ఏళ్లుగా ప్రతిఏటా జల్సా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ వేడుకలకు రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులు కోసం అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మసూద్, అయూబ్‌తోపాటు ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

3న గురుధామంలో ఉచిత మెగా వైద్య శిబిరం



వరంగల్: ములుగు రోడ్డు సమీపంలోని సప్త గురుధామంలో శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ వరంగల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ, సీఏ గోపీచంద్ అన్నారు. గురుధామంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్య శిబిరం వాల్‌పోస్టర్లను విడుదల చేసి ఆయన మాట్లాడారు. న్యూరో, కార్డియాలజీ, ఊపిరితిత్తులు, జనరల్ సర్జన్, గైనకాలజిస్టులు, దంత, కంటి, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, కిడ్నీ, ఫిజీషియన్లు పాల్గొని వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 98484 23133 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో మాదారపు సదాశివుడు, రేపాల రామచందర్, జి.ఉమాశంకర్, తదితరులు పాల్గొన్నారు.

శ్వేతార్కుడికి విభూదితో అభిషేకం




కాజీపేట: మాఘ మాసోత్సవాన్ని పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూల గణపతికి గురువారం విభూదితో అభిషేకం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు రాధాకృష్ణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి భక్తుల కోలాహలం మధ్య సిద్ధి, బుద్ధి వినాయకుడికి నిత్య కల్యాణోత్సవాన్ని అర్చకులు జరిపించారు. భారీగా తరలి వచ్చిన భక్తులతో ఆలయ పరిసర ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు వెంకటేశ్వర్లు శర్మ, సాయికృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ మాజీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వరంగల్ క్రైం: ఆర్మీ మాజీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని మాజీ సెంట్రల్ ఆర్మీ ఫోర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను గురువారం కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎలగేటి శ్రీనివాస్, వంగరి రాజేష్, సుధాకర్, రాతిపల్లి రాజు, మహ్మద్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌కు సన్మానం



కాజీపేట: కాజీపేట పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వై.సుధాకర్ రెడ్డిని పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ఇప్ప శ్రీకాంత్, మైసారపు సిరిల్ లారెన్స్, గోల్కొండ రాంబాబు, చిలువేరు విజయభాస్కర్, కొమురవెల్లి రమేష్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



హసన్‌పర్తి: వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రిటైర్డ్ హెచ్‌ఎం రుద్రయ్య



రామన్నపేట: చేయూతనందిస్తున్న పూర్వ విద్యార్థులు

హసన్‌పర్తి: తాము చదువుకున్న పాఠశాల, కళాశాలకు ఆర్థిక చేయూనందించి పూర్వ విద్యార్థులు తమ ఔదార్యం చాటుకున్నారు. హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థిని పబ్బా విజయలక్ష్మి – భాస్కర్ దంపతులు రూ.3 లక్షల విలువైన వాటర్‌ప్లాంట్‌ను బహూకరించారు. పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.రుద్రయ్య ముఖ్యఅతిథిగా హాజరై వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. సర్కార్ పాఠశాలల బలోపేతానికి, మౌలిక వసతుల కల్పనకు దాతలు, పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అమెరికాలో స్థిరపడిన విజయలక్ష్మి.. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమని ప్రశంసించారు. పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చకిలం రాజేశ్వర్ రావు, పూర్వ విద్యార్థులు వెలగందుల వెంకటేశ్వర్ రావు, వాసుదేవరావు, వెలగందుల రవీందర్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏవీవీకి ఆర్థికసాయం

రామన్నపేట: ఏవీవీ విద్యాసంస్థలో 1985 – 86లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఏవీవీ విద్యాసంస్థల అభివృద్ధికి రూ.90 వేల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యనభ్యసించిన విద్యాసంస్థల అభివృద్ధికి చేయూతనందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యాసంస్థల గౌరవ నిర్వాహకులు వాసుదేవులు, రాజేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, ఓంప్రకాశ్, రత్నాకర్, విశ్వేశ్వర్‌రావు పాల్గొన్నారు.

గౌరవప్రదమైనది అధ్యాపక వృత్తి



మాట్లాడుతున్న వీసీ రమేష్

కేయూ క్యాంపస్: సమాజంలో గౌరవప్రదమైన, ఆదర్శవంతమైన వృత్తి అధ్యాపక వృత్తి అని కాకతీయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ అన్నారు. హనుమకొండలోని యూనివర్సిటీ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ఫ్యాకల్టీ క్లబ్ కన్వీనర్ డాక్టర్ చిర్ర రాజు అధ్యక్షత వహించగా వీసీ రమేష్ మాట్లాడారు. అధ్యాపకుడికి రిటైర్మెంట్ అనేది ఉండదని, నిరంతరం విద్యార్థిగానే ఉంటారని చెప్పారు. కాకతీయ యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడుతూ అయిలయ్య గొప్ప సాహితీవేత్త, కవి, పరిశోధకుడు, విమర్శకుడు, పరిపాలన దక్షతగల వ్యక్తి అని కొనియాడారు. అలాగే, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ హనుమంతు, ప్రొఫెసర్ మల్లికార్జున్ రెడ్డి, ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి, భిక్షపతి, తిరుణహరి శేషు, శ్రీలత మాట్లాడారు. అనంతరం ఫ్యాకల్టీ క్లబ్ ఆధ్వర్యంలో గజమాలతో బన్న అయిలయ్యను సన్మానించారు. అనంతరం, ఆర్ట్స్ కళాశాల క్యాంపస్‌లో కొత్తగా నిర్మించిన కళాశాల బోధనేతర సిబ్బంది సంఘం కార్యాలయాన్ని వీసీ గురువారం ప్రారంభించారు.

బొడ్రాయి ఏర్పాటుకు భూమిపూజ



కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని శిరంగి రాజారాం (ఎస్ఆర్ఆర్) తోటలోని ఆకారపు వీరలక్ష్మి పాఠశాల సమీపంలో ఏర్పాటు చేయనున్న భూలక్ష్మి, శ్రీలక్ష్మి నాభిశిల (బొడ్రాయి) ప్రతిష్ఠకు గురువారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, కార్పొరేటర్లు పల్లం పద్మ, ముష్కమల్ల అరుణ, మాజీ కార్పొరేటర్ వేణుగోపాల్, బొడ్రాయి కమిటీ సభ్యులు తాటిపాముల భిక్షపతి, చిలువేరి రవీందర్, బండి కుమారస్వామి, ఊరుగొండ శంకర్, బొల్లం మధు, పరదేశి రాజేష్, మడిపల్లి వినయ్, బండారి పూర్ణచందర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'అధ్యాపకుల' సమస్యలు పరిష్కరించాలి



విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు యూనివర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహానికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ విభాగాలు, వర్సిటీ కళాశాలల్లో 16 పీరియడ్ల వర్క్‌లోడు కలిగిఉండి అర్హత కలిగిన పార్ట్‌టైం అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులుగా కన్వర్షన్ చేయాలని సూచించారు. మిగితా పార్ట్‌టైం అధ్యాపకులకు పీరియడ్‌కు రూ.700 నుంచి రూ.వేయికి రెమ్యూనరేషన్ పెంచాలని కోరారు. ధర్నాలో కేయూ పార్ట్‌టైం అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రాంబాబు, బాధ్యులు నరేందర్‌నాయక్, దేవోజీనాయక్, భాగ్యమ్మ, తిరుణహరి శేషు, రమేష్, లక్ష్మీనారాయణ, రాజేంద్రప్రసాద్, పూజిత, రజని, నవీన్, సదానందం, చందర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి



వరంగల్: వరంగల్ మండలం ఏనుమాముల ప్రాంతంలోని ప్రభుత్వ భూములను రక్షించాలని స్థానికులు కోరారు. ఈమేరకు తహసీల్దార్ ఎక్బాల్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని ముసలమ్మకుంట వద్ద ఉన్న ప్రభుత్వ భూములను కొంతమంది వ్యక్తులు, రియల్టర్లు.. ఎస్సీలను అడ్డం పెట్టుకుని విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఆ భూముల్లో మట్టిని తవ్వించి అమ్మకాలు చేస్తున్నారని పేర్కొన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుని భూములను రక్షించాలని కోరారు. గోవర్దన్, అన్నబోయిన ప్రేమలత, అన్నపూర్ణ, శిరీష, పద్మ, శ్రీలత ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించుకోవాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులతో అతిథులు

విద్యారణ్యపురి: సైన్స్‌పై విద్యార్థులు ఆసక్తి కనబరుస్తూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని శాంతి స్వరూప్ బట్నాగర్ అవార్డు గ్రహీత, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్.మోహన్ రావు అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ సౌజన్యంతో హనుమకొండ కాకతీయ ప్రభుత్వ కళాశాలలో రెండు రోజులుగా విద్యార్థులకు వివిధ అంశాలపై నిర్వహిస్తున్న సదస్సులో భాగంగా గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. దేశాభివృద్ధిలో శాస్త్ర సాంకేతిక అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సర్ సీవీ.రామన్ ప్రయోగ ఫలితాలు నిత్యజీవితంలో ఏ విధంగా ఉపయోగపడతున్నాయో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి అధ్యక్షత వహించగా వరంగల్ నిట్‌కు చెందిన ప్రొఫెసర్లు లక్ష్మారెడ్డి, డాక్టర్ రామరాజు, కేడీసీ కెమిస్ట్రీ విభాగం అధిపతి డాక్టర్ రమేష్ మాట్లాడారు. ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీల విజేతలకు మోహన్‌రావు, అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లయ్య అధ్యాపకులు డాక్టర్ సంజీవయ్య, డాక్టర్ విజయపాల్ రెడ్డి, డాక్టర్ ఎం.రాంబాబు, మసూద్ అహ్మద్, డాక్టర్ వెంకటేష్, డాక్టర్ గణేష్, కే.రమేష్, డాక్టర్ సునీత, డాక్టర్ అశోక్, డాక్టర్ మొగిలి తదితరులు పాల్గొన్నారు.

నేడు బీజేపీ విజయసంకల్ప యాత్ర

హన్మకొండ: బీజేపీ విజయసంకల్ప యాత్ర మార్చి 1న హనుమకొండ, వరంగల్ జిల్లాలోని వరంగల్ పశ్చిమ, వర్ధన్నపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాల్లో సాగనుందని బీజేపీ నేతలు తెలిపారు. కలిసి కదులుదాం.. మరోసారి బీజేపీని గెలిపిద్దాం, మూడోసారి నరేంద్ర మోదీని ప్రధానిని చేద్దాం అనే నినాదంతో ఈ యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం హనుమకొండలోని వేయి స్తంభాల దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం యాత్ర ప్రారంభం కానున్నట్లు తెలిపారు. హనుమకొండ చౌరస్తాలో జరగనున్న కార్నర్ మీటింగ్‌లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రసంగిస్తారని, అనంతరం ర్యాలీగా బయలుదేరి పోలీసు హెడ్‌క్వార్టర్స్, సుబేదారి మీదుగా కాజీపేటకు యాత్ర చేరుకుంటుందని వివరించారు. కాజీపేటలో రోడ్ షో నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 12గంటలకు వర్ధన్నపేట నియోజకవర్గం కడిపికొండలోకి ప్రవేశించి రాంపేట, తరాలపల్లి, వనమాల కనపర్తి, వెంకటాపురం మీదుగా మధ్యాహ్నం 2గంటలకు ఐనవోలుకు యాత్ర చేరుకుంటుందని పేర్కొన్నారు. ఐనవోలు మల్లన్న స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 2.30గంటలకు కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రసంగిస్తారని చెప్పారు. అనంతరం పున్నేలు, పంథిని, కొంత్రాల, ఇల్లందు మీదుగా సాయంత్రం 6గంటలకు వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఆర్టీఓ కూడలి వద్ద ప్రవేశించి ఇక్కడి నుంచి శంభునిపేట, నాగమయ్య గుడి, వాల్‌మార్టు, శివనగర్ ఇసుక అడ్డా మీదుగా వరంగల్ హెడ్‌ఆఫీస్ కూడలికి రాత్రి 7గంటలకు చేరుకుందని వివరించారు. అనంతరం పోచమ్మమైదాన్ మీదుగా భద్రకాళి దేవాలయానికి చేరుకుని, అమ్మవారి దర్శనంతో యాత్ర ముగుస్తుందని నాయకులు తెలిపారు.

సంక్షిప్తంగా

వివాహిత అదృశ్యం



అరుంధతి

ఖిలా వరంగల్: మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో భార్యాభర్తల మధ్య చిన్నపాటి గొడవతో మనస్థాపం చెందిన సదరు మహిళ.. బుధవారం మధ్యాహ్నం అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. నాగేంద్రనగర్, నాగమయ్య గుడి సమీప కాలనీకి చెందిన జంగిడి రాజు, అరుంధతి దంపతులకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. రాజు నగరంలో బేకరీ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం దంపతుల మధ్య గొడవ జరిగింది. దాంతో అరుంధతి మధ్యాహ్నం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా పిల్లలు జాగ్రత్త అంటూ లెటర్ రాసి వెళ్లి బయటికి వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించకపోవడంతో రాజు ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ముస్సీరుల్లా తెలిపారు.

యువకుడిపై దాడి

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట జంక్షన్‌లో ఓ యువకుడిపై ముగ్గురు వ్యక్తులు గురువారం సాయంత్రం దాడి చేశారు. ఈ దాడిలో గాయపడిన వ్యక్తి స్థానికుల సహకారంతో ఆస్పత్రికి వెళ్లారు. పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించిన ఆ ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

మాజీ సర్పంచ్‌పై కేసు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం సీతానాగారం గ్రామ మాజీ సర్పంచ్ ఐలయ్యపై కేసు నమోదైంది. రెండు రోజుల క్రితం ఐలయ్య మద్యంతాగి వచ్చి గ్రామపంచాయతీ కార్యదర్శి స్వప్నను కుర్చీతో కొట్టడానికి యత్నించడంతో పాటు పరుష పదజాలంతో ఆమెను దూషించారు. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదుతో ఐలయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

వ్యవసాయ క్షేత్రంలో అగ్ని ప్రమాదం



మడికొండ: మడికొండ శివారులోని అజిత్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో గురువారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కొయ్య కాళ్లు, ఎండుగడ్డి అగ్నికి దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ నాగరాజు, ఎల్ఎఫ్ జనార్దన్, సిబ్బంది వెంకటేశ్వర్లు, యాకుబ్, ఎండీ.రహీం తదితరులు పాల్గొన్నారు.

మిర్చి బస్తా కాల్చేందుకు యత్నం..?

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఒక మిర్చి రైతు సరైన ధర రాలేదంటూ రెండు బస్తాలను దహనం చేసేందుకు గురువారం రాత్రి మిర్చి యార్డులో ప్రయత్నించినట్లు తెలిసింది. మార్కెట్‌కు తేజ, 2043(బాడిగ), 9 తాలు మిర్చి బస్తాలను తీసుకొచ్చాడు. తెచ్చిన మిర్చిలో ఎక్కువ పదును ఉన్నప్పటికీ క్వింటాల్‌కు రూ.15ల వరకు ధరలకు కొనుగోలుదారుడు చెల్లించారు. అయినప్పటికీ ధర తక్కువ వచ్చిందని ఆరోపిస్తూ బస్తాకు నిప్పు అంటించేందుకు యత్నించడంతో అక్కడే ఉన్న మార్కెట్ అధికారులు ఆర్పివేశారు.

బ్రిడ్జిపై రెండు వాహనాలు ఢీ



కాజీపేట: కాజీపేటలోని రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గురువారం సాయంత్రం పాఠశాల విద్యార్థులతో వెళ్తున్న ఆటోను వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. దాంతో అశ్విత అనే విద్యార్థినికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఫాతిమా బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులను ఆటోలో తీసుకుని కాజీపేట వైపు వస్తుండగా ప్రమాదం జరిగింది. కారు ఢీకొట్టడంతో గాయపడిన అశ్వితను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. రైల్వే ఉద్యోగుల రాకపోకలకు ఉపయోగించే కారు.. ఆటోను ఢీకొట్టడంతో బ్రిడ్జిపై ఇరువైపులా కొద్దిసేపు ట్రాఫిక్ స్తంభించింది. ఆటో డ్రైవర్ ఫిర్యాదు మేరకు కారును పోలీస్ స్టేషన్‌కు తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

హన్మకొండ చౌరస్తా: పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. హనుమకొండలోని 5వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు సిరబోయిన కరుణాకర్.. సుమారు వెయ్యి మంది కార్యకర్తలతో సీపీఐలో చేరారు. ఈ సందర్భంగా కేయూ, పెద్దమ్మగడ్డ బైపాస్ రోడ్డులో రెడ్డికాలనీలోని శారదా గార్డెన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమానికి సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆయన ఆహ్వానించారు. అంతకుముందు కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ నుంచి శారదా గార్డెన్ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో సాంబశివరావు మాట్లాడుతూ అధికారం కోసమే పనిచేస్తున్న పార్టీలకు ఎన్నికలప్పుడే ప్రజల సమస్యలు గుర్తుకొస్తాయని, ఎర్రజెండా పార్టీలు మాత్రం నిరంతరం ప్రజల మధ్యనే ఉంటాయని అన్నారు. దేశంలో వందేళ్లుగా అనేక త్యాగాలతో పునీతమై సజీవంగా ఉన్న పార్టీ సీపీఐ అని కొనియాడారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇండియా కూటమిలో భాగంగా వరంగల్ ఎంపీ స్థానాన్ని సీపీఐకి కేటాయించాలని కోరుతున్నట్లు చెప్పారు. సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నేదునూరి జ్యోతి, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, షేక్‌బాషామియా, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఏశబోయిన శ్రీనివాస్, బుస్సా రవీందర్, గుండె బద్రి, లలిత, రమ, రవి, సంతోష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నగదు బదిలీ ద్వారా అమలు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ: గొర్రెల పంపిణీ పథకాన్ని నగదు బదిలీ ద్వారా అమలు చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు శాతబోయిన రమేష్, కార్యదర్శి కాడబోయిన లింగయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని హనుమకొండ కనకదుర్గ కాలనీలోని స్వగృహంలో సంఘం నాయకులు గురువారం కలిసి వినతి పత్రం అందించారు. ఆ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా రమేష్, లింగయ్య మాట్లాడుతూ ప్రమాదవశాత్తు మరణించిన గొల్ల కురుమలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. జిల్లాలో 7,318 మందికి గొర్ల పంపిణీ చేయాల్సి ఉందని చెప్పారు. మేనిఫెస్టోలో ప్రకటించిన మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షలు నగదు అమలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల రమేష్, చిగుల్ల చేరాలు, నాయకులు నల్లబెట్టా చిన్నరాజు, పింజెర్ల రాజకుమార్, మామిళ్ల కుమార్, కొడారి చిరంజీవి, సురేష్ పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న మంద నరేష్

కేయూ క్యాంపస్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేష్ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలో గురువారం ఆయన మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త చెబుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీ ప్రకటించడం హర్షించదగిన విషయం అని అన్నారు. అలాగే, రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై కూడా దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని సూచించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలపై చర్య తీసుకోవాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వమే ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, యూనివర్సిటీ అధ్యక్షుడు మచ్చ పవన్‌కల్యాణ్, నరేందర్, ప్రణయ్, అఖిల్, సుకురా, సూర్య, సాయికిరణ్ వెంకటేష్, రాజ్‌కుమార్, పృథ్విరాజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ నేత లింగమూర్తి అమరుడు



నివాళులర్పిస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జాతీయ కమిటీ సభ్యుడు కూరపాటి లింగమూర్తి అమరుడని ఐఎఫ్‌టీయూ నాయకులు అన్నారు. కూరపాటి లింగమూర్తిని స్మరిస్తూ నగరంలోని 27వ డివిజన్‌లో ప్రింటింగ్ అండ్ బైండింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కార్మికులు కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలవేసి గురువారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ లింగమూర్తి తను చదువుకున్న రోజుల్లో విప్లవ విద్యార్థి సంఘంలో పనిచేశారని తెలిపారు. ఆజంజాహి మిల్లు కార్మికుల హక్కుల కోసం ఉద్యమాలు నిర్వహించారని, ప్రింటింగ్ అండ్ బైండింగ్ కార్మికుల కోసం పోరాటాలు చేసినట్లు గుర్తుచేశారు. నగరంలో ప్రజా సమస్యల పరిష్కారానికికృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో ప్రింటింగ్ అండ్ బైండింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గంగుల దయాకర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ, కొంతం కృష్ణ, బండి కోటేశ్వరరావు, రాచర్ల బాలరాజు, వనం కిరణ్, రాజేందర్, సదానందం, నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ కేసులకు వ్యతిరేకంగా సదస్సు



మాట్లాడుతున్న అంజమ్మ, పద్మకుమారి

నయీంనగర్: విప్లవోద్యమంపై నిషేధం, అక్రమ కేసులు, ఎన్ఐఏ దాడులకు వ్యతిరేకంగా హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో అమరుల బంధుమిత్రుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సదస్సు నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షురాలు అంజమ్మ, కన్వీనర్ పద్మకుమారి తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాసిందని, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ విషయాన్ని గుర్తించడం మంచి పరిణామం అని అన్నారు. అయినా, గత ప్రభుత్వంలాగే ఇప్పుడూ అక్రమ కేసులు, ఎన్ఐఏ దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజాస్వామ్య పునరుద్ధరణను చర్చనీయాంశం చేయడానికి అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 2న సదస్సు నిర్వహించతలపెట్టినట్లు చెప్పారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శాంత, భవాని, కళ, ఫణి తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీవీబీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఉద్యోగ విరమణ



హన్మకొండ: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి కారింగుల భిక్షమయ్య గురువారం ఉద్యోగ విరమణ చేశారు. గ్రామీణ బ్యాంకు ఉద్యోగిగా 33 ఏళ్ల ఉద్యోగ ప్రయాణంలో ఎక్కువ భాగం ట్రేడ్ యూనియన్ కార్యకలాపాలతో ఆయన పయనం సాగింది. మహబూబ్‌నగర్‌లోని అప్పటి సంఘమేశ్వర గ్రామీణ బ్యాంక్‌లో 1991 మార్చి 4న ఉద్యోగంలో చేరిన ఆయన.. విద్యార్థి నాయకునిగా ట్రేడ్ యూనియన్ అనుభవంతోపాటు ఉద్యోగుల సంఘంలో కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికై అంచెలంచెలుగా ఎదిగారు.